క్లుప్తంగా

ఘనంగా రామాలయంలో విగ్రహాల పునఃప్రతిష్ట



హోమంలో పాల్గొన్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: రామాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని సిద్ధేశ్వరంలోని రామాలయంలో విగ్రహాల పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అలాగే హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వంశీరెడ్డి ముందుగా సీతారాములను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్‌కు ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామస్తుల శ్రమదానం



ఆలయం వద్ద శ్రమదానంలో మహిళలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో నిర్మిస్తున్న గ్రామదేవతలైన శ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల నూతన ఆలయాల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఆదివారం సాయంత్రం వార్డులోని మహిళలు ఆలయ నిర్మాణంలో శ్రమదానం చేశారు. తుంగ్లాం గ్రామానికి చెందిన బి.ఆర్. అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు శ్రమదానం చేశారు.

అలంకార ప్రాయంగా బోర్లు



దశమికొండలో పాడైన బోరు

గాజువాక : గాజువాక జోన్‌లోని వివిధ వార్డులలో పలు మంచినీటి బోర్లు అలంకార ప్రాయంగా మిగిలాయి. నీటి సరఫరా విభాగం అధికారులు కొత్తగా బోర్లు వేస్తున్నప్పటికీ పాత బోర్లపై దృష్టి సారించడంలేదనే ఆరోపణ లున్నాయి. 70వ వార్డు దశమికొండ కాలనీలో ఒక బోరు నెలల తరబడి పని చేయపోయినా దాని మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 87వ వార్డు అప్పికొండ కాలనీలోని హైస్కూల్ రోడ్‌లో బోరు పని చేయకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్నది వేసవి కాలం కావడంతో బోర్లకు మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఘనంగా ఫుట్‌బాల్ క్లబ్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

ఏయూ క్యాంపస్: నగరానికి చెందిన బ్లూస్టార్స్ స్పోర్ట్స్, కల్చరల్ క్లబ్ 12వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏయూ క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ క్రీడల్లో యువతను భాగస్వాములను చేస్తూ బ్లూస్టార్స్ ఫుట్‌బాల్ క్లబ్ దశాబ్ద కాలంగా వందలాది మంది క్రీడాకారులను తీర్చిదిద్దిందని కొనియాడారు. క్లబ్ నిర్వాహకుడు, కోచ్ నరేష్ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా 700 మంది వరకు యువతను ఫుట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దామన్నారు. వీరిలో పది మంది వరకు జాతీయ స్థాయిలో రాణించారన్నారు.

విజయేంద్ర సరస్వతి ప్రవచనాలు అమోఘం



ప్రవచిస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి



ప్రవచనాలు వింటున్న భక్తులు

గాజువాక : కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను కట్టిపడేశాయి. గాజువాక వర్తక సంఘం, గాజువాక ఆర్యవైశ్య సంఘం ఆహ్వానం మేరకు ఆయన గాజువాకలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఆయన అనంతరం కొద్దిసేపు అనుగ్రహ భాషణం చేశారు. ఆయన ప్రవచనాలతో భక్తులు ఆనందపారవశ్యంలో మునిగి తేలారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి చందు, గాజువాక ఆర్యవైశ్యసంఘం అధ్యక్ష కార్యదర్శులు రఘునాథ గుప్త, ఏవీఎస్ గుప్త, వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శులు పీపీఎస్ నాగేశ్వరరావు, పూసర్ల వెంకటేష్, ప్రతినిధులు వూడరాజా కేశారపు శ్రీను రమేష్, కూరా రమేష్, బండి నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా.. సాగిపోయేలా..



పాత రోడ్డు



కొత్తగా నిర్మించిన నడుపూరు నూకాంబిక ఆలయం రోడ్డు

పెదగంట్యాడ : జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు నూకాలమ్మ ఆలయం నుంచి చిన నడుపూరు నూకాంబిక అమ్మవారి ఆలయం వరకూ కొత్తగా తారు రోడ్డు నిర్మించారు. గతంలో ఈ రోడ్డు అధ్వానంగా ఉండేది. రాళ్లు తేలిపోవడంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడేవారు. అసలు ఈ రహదారిలోకి రావాలంటేనే హడలిపోయేవారు. రోడ్డు మొత్తం ఛిద్రం కావడం..రాళ్లు తేలిపోవడంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురయ్యేవి. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రూ.19.80 లక్షలతో 390 మీటర్ల మేర కొత్తగా రోడ్డు వేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయని, ఇక ప్రయాణం సాఫీగా సాగిపోతోందని వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహనీయులు నడిచిన నేల విశాఖ నగరం

ఎంవీపీ కాలనీ: నేటి ఆధునిక ప్రపంచానికి ఆధ్యాత్మిక చైతన్యం కల్పించిన మహనీయుల నడిచిన నేల విశాఖపట్నమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. వారం రోజులుగా ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా షణ్ముఖ శర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని విశాఖ నుంచి సద్గురు శివానందమూర్తి, ఎక్కిరాల కృష్ణమాచార్య, శ్రీభాష్యం అప్పలాచార్యులు వంటి మహనీయులు విశ్వవ్యాప్తం చేశారన్నారు.

పందుల ఏరివేత



పందులను షూట్ చేస్తున్న షూటర్

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలో పందుల ఏరివేతకు జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ చర్యలు చేపట్టింది. వరహాల స్వైర విహారం కథనానికి ఆదివారం జీవీఎంసీ అధికారులు స్పందించారు. కొండయ్యవలస ఆవాసాల మధ్యలో సంచరిస్తున్న 12 పందులను షూట్ చేసి తరలించారు. గత కొద్ది నెలలుగా అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసలో గుంపులు గుంపులుగా పందులు సంచరిస్తూ ఇళ్ల ఆవరణలోకి కూడా చొచ్చుకుపోతుండడంతో గ్రామ నాయకులు పట్టా రామ అప్పారావు ఈ విషయాన్ని సాక్షి దృష్టికి తీసుకురావడంతో వార్త ప్రచురితమైంది. స్పందించిన జీవీఎంసీ ఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ సారథ్యంలో సచివాలయ సిబ్బంది రాంబాబు పర్యవేక్షణలో పందులను కాల్చివేశారు.

ఆదమరిస్తే అంతే..



మహిళా రైతుబజార్‌వద్ద ప్రధాన కాలువ

గాజువాక : పాతగాజువాక దరి మహిళా రైతు బజార్‌వద్ద ప్రధాన కాలువ ప్రమాదకరంగా మారింది. కాలువకు రక్షణ గోడ లేకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. రాత్రిపూట ఆ రోడ్డులో ప్రయాణించే సమయంలో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం చోటుచేసుకొనే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. పందులు కూడా అక్కడినుంచే కాలువలోకి దిగి చిందరవందర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి కాలువకు రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.

విశాఖ ఉక్కు ఉద్యమంపై డాక్యుమెంటరీ



మాట్లాడుతున్న కేకే రావు

కూర్మన్నపాలెం : ఉక్కు రిలే నిరాహారా దీక్షలు ప్రారంభమై రెండేళ్లు పూర్తైన సందర్భంగా విశాఖ ఉక్కు ప్రాముఖ్యతను, ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ విశాఖ ఉక్కు పేరుతో నిర్మించిన డాక్యుమెంటరీని వైజాగ్ యూట్యూబ్ చానల్‌లో కె.కె.రావు ఎక్స్ డైరెక్టర్ ఆపరేషన్స్ స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరం వద్ద ఆదివారం విడుదల చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న 731వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో డాక్యుమెంటరీ ఫిల్మ్ విడుదలను పురస్కరించుకుని ఉక్కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బోండా తవుడన్న, బాయ్యా మల్లయ్య, ఎల్‌వీ రమణ, ఎస్.సత్యనారాయణ, మాటూరి శ్రీనివాసరావు, ముప్పిడి రాజు, సత్యనారాయణ, బి.ఎస్.రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కె.కె.రావు మాట్లాడుతూ కార్మికులను, ఉద్యమ స్ఫూర్తిని, రెండేళ్లలో కార్మికులు చేస్తున్న పోరాట ప్రతిమను కొనియాడారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యారామ్, వరసాల శ్రీనివాసరావు, కె.ఎస్.ఎన్.రావు, పరంధామయ్య, రమణారెడ్డి మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాలు ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేదిలేదన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకలు , ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

87వ వార్డులో పేరుకుపోతున్న చెత్త



87వార్డులోని కాళింగవీధి జంక్షన్ వద్ద చెత్తకుప్పలో సంచరిస్తున్న పందులు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి కాళింగవీధి జంక్షన్ వద్ద వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పందులు, దోమలు సంచారం అధికమై ప్రజలు అనేక రోగాల భారిన పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడతో రోడ్డు మార్గం మొత్తం దుర్భరంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– ప్రగడ లక్ష్మి, కాళింగవీధి

డంపింగ్ యార్డ్ కాదిది.. రోడ్డే!



దంపర్ బిన్లు ఉన్నా రోడ్డుపై విచ్చలవిడిగా పడేసిన చెత్త, చిందర వందర చేస్తున్న పందులు



రోడ్డుపై పడేసిన తాగిపడేసిన కొబ్బరిబొండాలు

పెదగంట్యాడ: మండలంలోని చిన నడుపూరు వుడా కాలనీ మధ్యలోని ప్రధాన రహదారిలో చెత్తాచెదారాన్ని విచ్చలవిడిగా పడేస్తున్నారు. ఇక్కడ రెండు డంపర్ బిన్లు ఉన్నాయి కానీ వాటిని సక్రమంగా పెట్టకపోవడంతో స్థానికులు, వ్యాపారులు తమ ఇళ్లలోని, వ్యాపారాలకు చెందిన చెత్తను రోడ్డుపై విసిరేస్తున్నారు. దీంతో పందులు, పశువులు అక్కడ చేరి చిందరవందర చేస్తున్నాయి. తద్వారా దుర్వాసన వెదజల్లుతోంది. దీని కారణంగా వాహనచోదకులు, పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొని ఉంది. ఈ రోడ్డులో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో డంపర్ బిన్లు నిండిపోతున్నాయి. ఇక్కడ నిత్యం ఇదే పరిస్థితి నెలకొని ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై చెత్త వేయకుండా చూడాలని, అలాగే ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని కోరుతున్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి సహకారం అవసరం

ఆరిలోవ: మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని అఖిల భారత సీమా సురక్ష సహ ప్రముఖ్ జి.మురళీధర్ కోరారు. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాల ఆవరణలో ఆదివారం మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమితి విధి విధానాలపై చర్చించారు. మత్స్యకారుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహకారం కోరాలి.. తదితర అంశాల గురించి మాట్లాడారు. అనంతరం మురళీధర్ మాట్లాడుతూ ప్రకృతి సంపదైన తీర ప్రాంతాలను అందరూ కలసికట్టుగా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నాయకులకు పూర్తిస్థాయిలో మత్స్యకారుల విధి విధానాలు, సమస్యలపై అవగాహన ఉండాలన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన



దంత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

అగనంపూడి: ప్రతీ ఒక్కరూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు అన్నారు. 85వ వార్డు లంకెలపాలెం శివారు గంగిరెడ్లకాలనీ, ఎస్సీకాలనీల్లో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కింతాడ ఈశ్వరరావు సారథ్యంలో అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల సారథ్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజు మాట్లాడుతూ మానవుని అవయువాల్లో దంతాలు కూడా కీలకమైనవని, దంత సంబంధమైన రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకొని వాటిని సంరక్షించుకోవాలన్నారు. 170 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, సుందరపు అప్పారావు, వై.వెంకటరావు, వైద్యులు డాక్టర్ అవినాష్, ఎ.భవానీ, సీఎచ్.వివేక్, రష్మిక, వార్డు కన్వీనర్లు కాతా నూకేశ్వరరావు, పార్వతి, మామిరెడ్డి శ్రీను, తలకొండ జయ వెంకట కుమార్, బొడ్డు పుత్రయ్య, నెల్లి కన్నారావు, సుందరపు శ్రీను, తురసారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి గృహసారథులు కీలకం



మాట్లాడుతున్న వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: గృహసారథులు (కన్వీనర్లు) నిబద్ధతో వ్యవహరించి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేసి తిరిగి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ అన్నారు. ఆదివారం సాయంత్రం అక్కిరెడ్డిపాలెం కల్యాణమండపంలో నూతన కన్వీనర్లతో వార్డు వలంటీర్ల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న లతీష్ మట్లాడుతూ వలంటీర్లకు గృహసారథులు సంయుక్తంగా వార్డులో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, ఇతర సమస్యలు, ప్రభుత్వం నుంచి ఇంకా వారికి అందవల్సిన సౌకర్యాలు తెలుసుకొని వారి సమస్యలపై స్పందించాలన్నారు. గృహసారథుల ప్రతీ అంశాన్ని అవగాహన చేసుకొని వ్యవహరించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం 98 శాతం సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డిది అని ప్రజల్లో లోతుగా తీసుకువెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, కన్వీనర్లు నంబారు రాజు, నేలపాటి సత్యవతి, సయ్యద్ హుస్సేన్, సహాయకుడు తెంటు గోపాలరావు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



బల్లల పండగలో ఎమ్మెల్యే నాగిరెడ్డి



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దువ్వారపు

అగనంపూడి : జీఎంసీ 85 వార్డు కొండయ్యవలస గ్రామంలో శ్రీ బొర్రమాంబ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బల్లల పండగను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. రజక సేవా సంక్షేమ సంఘ అధ్యక్షుడు తోకాడ రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ రజకుల సంప్రదాయ పండగను వైభవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రజక సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రజకుల జీవన స్థితిని పరిగణలోకి తీసుకొని కొన్ని రాష్ట్రాల్లో రజకులను ఎస్సీ కేటగిరిలో చేర్చడం జరిగిందన్నారు. రజకులను ఎస్సీ కేటగిరిలో చేర్చడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. పండుగలో భాగంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ దువ్వారపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీ ప్రసాద్, ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, నాయకులు నెల్లి శ్రీనివాసరావు, విందుల వరహాలు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.